కోర్కెలు తీర్చే కాలభైరవుడు


పార్‌పల్లి ఆలయంలో కొలువైన కాలభైరవస్వామి

- నేడే జయంతి ఉత్సవాలు
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

కోటపల్లి: చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం..కొండలు, గుట్టల కింద నీటిధారలు.. పక్కనే గోదావరమ్మ గలగలలు..పచ్చని పొలాలు..పక్షుల కిలకిలలు వెరసి ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. భైరవకొండపై తపస్సు చేసుకుంటున్న రుషులు, మునీశ్వరులు యాగశాలలను గోదావరినది తన ప్రవాహంతో ముంచెత్తుతుండటంతో శివాజ్ఞతో నది ప్రవాహనికి అడ్డుగా నిలిచి నది దిశనే భైరవుడు మార్చాడని స్థల పురాణం చెబుతోంది. భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా విలసిల్లుతున్న కాల భైరవునిపై ప్రత్యేక కథనం.

దిశమార్చిన..దిగంబర భైరవుడు!
కోటపల్లి మండలం పార్‌పల్లి సమీపంలోని అటవీప్రాంతంలో కొండపై కాలభైరవుడు స్వయంభుగా వెలిశాడు. నాసిక్ సమీపంలోని త్రయంబకేశ్వరం వద్ద జన్మించిన గోదావరి ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్వేది వద్ద సముద్రంలో కలిసే వరకు తూర్పు వైపునకే ప్రవహిస్తుంది. చెన్నూర్ మండలం పొక్కూర్ వద్ద నుంచి పార్‌పల్లి భైరవకొండ మూలమలుపు వరకు గోదావరి నది ఉత్తర దిక్కులో ప్రవహిస్తుంది. ఉత్తర దిక్కుగా ప్రవహించడం వల్ల ఈ ప్రాంతంలో గోదావరి నదిని పంచక్రోశ ఉత్తర వాహినిగా పిలుస్తారు. ఇక్కడ స్నానమాచరించడం పుణ్యమని పండితులు చెబుతారు.

శివాంశ సంభూతుడు..
భైరవుడు శివాంశ సంభూతుడని పంచభూతాల సూర్యచంద్రాది గ్రహాలు భైరవుని అదుపాజ్ఞలలో ఉంటాయని పండితులు అంటారు. కాలాన్ని శాసించినందున కాలభైరవుడు అనే పేరు వచ్చిందని శివ పురాణం చెబుతుంది. భైరవుడు ఇక్కడ కొలువై ఉండటంతో ఈప్రాంతాన్ని పవిత్రంగా భావిస్తారు. భక్తులు పార్‌పల్లి గ్రామస్తులు తమ ఇంట్లో ఏ శుభ కార్యం జరిగినా మొదటి మొక్కు భైరవునికే చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది.

నేడు భైరవాష్టమి
ప్రతిఏటా భైరవాష్టమి వేడుకలను ఇక్కడ ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం జరిగే భైరవ జయంతి ఉత్సవాలకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, హైదరాబాద్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. కోరికలు తీరిన భక్తులు వారి కానుకలను ఆ దేవునికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. భైరవస్వామి జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు నీడ, నీళ్ల భోజనం వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ కుమార్‌లు హాజరయ్యే అవకాశం ఉంది. భక్తులకు ఇబ్బంది లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.


ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అభివృద్ధి చేయాలి



భైరవకొండను అభివృద్ధి చేసి పార్‌పల్లికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి. వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన భైరవకొండను దేవాదాయశాఖ గుర్తించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి. గుట్ట వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి.
– రాజేశ్, స్థానిక భక్తుడు

ప్రతీవారం తప్పక వస్తా



పార్‌పల్లి భైరవస్వామి ఆలయంలో ప్రతీ ఆదివారం పూజలకు వస్తాను. గ్రామంలో ఎవరి ఇంటినైనా ఏ శుభకార్యం ఉన్న మొదట స్వామివారికి పూజలు చేస్తాం. కోరిన కోర్కె తీర్చే దేవుడు భైరవస్వామి.
– శ్రీకాంత్, భక్తుడు

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి: మండల కేంద్రంలోని శ్రీభక్తమార్కండేయస్వామి ఆలయ 3వ వార్షికోత్సవాన్ని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. హోమం, పూర్ణాహుతితోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మార్కండేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం వారికి అన్నప్రసాద వితరణ చేశారు. పద్మశాలి సంఘ నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కిడి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


ముక్కిడి పోచమ్మకు మొక్కుతున్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీశ్రీనగర్ తోళ్ల వాగు సమీపంలో ముక్కిడి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. పురోహితుడు రామగుండం రాముశర్మ ఆధ్వర్యంలో ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ వరంలాంటిది


మాట్లాడుతున్న జనార్దన్

దండేపల్లి: మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిదని తెలుగు పాఠ్యపుస్తక రచయిత కొండు జనార్దన్ అన్నారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ తరగతులను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ తరగతులను అభ్యాసకులు సద్వినియోగం చేసుకుని, ఏప్రిల్‌లో జరిగే వార్షిక పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. అధ్యయన కేంద్రం సహాయ కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు రాంమోహన్, రామన్న పాల్గొన్నారు.

పీవీఆర్ వర్ధంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పీవీరావు 19వ వర్ధంతిని పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో పీవీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాలల హక్కుల కోసం పీవీఆర్ చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. నాయకులు పలిగిరి కనకరాజు, నక్క శ్రీనివాస్, గోక శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైజ్ఞానిక మహాసభలు విజయవంతం చేయండి

మంచిర్యాలఅర్బన్: నల్గొండలో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) తెలంగాణ రాష్ట్ర ఆరవ విద్య–వైజ్ఞానిక మహాసభలు విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, పత్రిక కన్వీనర్ తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు వాహిద్, ఐ.పోచన్న, ఆర్ శ్రీధర్, శంకరయ్య, శివానంద్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన కాగిత గోపాల్ గత మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అతనితో కలిసి పదోతరగతి చదివిన 1998–99 బ్యాచ్ మిత్రులు, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి ఆదివారం అందించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

బెల్లంపల్లి: చిన్నతనం నుంచి కలిసి చదువుకున్న ఓ స్నేహితుడు అకాల మృతి చెందడంతో అతడి కుటుంబాన్ని ఆదుకోవడానికి ఆదివారం స్నేహితులు ముందుకు వచ్చి ఆర్థిక వితరణ చేశారు. పట్టణంలోని ఏఎంసీ ఏరియాకు చెందిన పెద్దపల్లి శ్రీనివాస్ ఇటీవల గుండెనొప్పితో మృతిచెందాడు. ఆయనతో కలిసి స్థానిక సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ టెన్త్ చదివిన స్నేహితులు రూ.52 వేలు పోగుచేశారు. మృతుడి చిన్న కూతురు పేరిట పోస్టాఫీసులో రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా మిగతా రూ.2 వేలలో శ్రీనివాస్ తల్లి, భార్యకు రూ.వెయ్యి చొప్పున నగదు అందించారు.


ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందిస్తున్న స్నేహితులు

పేదింటి యువతి పెళ్లికి దాతల సాయం

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన నిరుపేద అయిన చెరుకుల పద్మ–భూమేష్ దంపతుల కూతురు రక్షిత వివాహానికి ఆదివారం దండేపల్లి అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రూ. 20 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూ.7200, రాజశేఖర్ రూ.5 వేలు, జాడి వెంకట్ వాట్సాప్ గ్రూపు సభ్యులు రూ. 2500, జనతా యూత్ సభ్యులు రూ.4 వేలు, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్ 50 కిలోల బియ్యం అందజేశారు. అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు చెన్నవేని భానుప్రసాద్, ముఖ్య సలహాదారు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అల్లంల కుమారస్వామి యాదవ్, మాజీ ఉపసర్పంచ్ సిందం చంద్రయ్య, సుమన్, సభ్యులు అరిగేలా సుధాకర్, ఎర్రం తిరుపతి, జాడి వెంకట్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

అండగా నిలిచి ఆర్థిక సాయం అందించి..

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మ గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ ముద్దసాని మహేశ్ ఇటీవల విధినిర్వహణలో గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో అతని కుటుంబానికి అతనితోపాటు పని చేస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు అండగా నిలిచారు. ఆదివారం బాధిత కుటుంబానికి రూ.1,13,090లను ఆర్థికసాయాన్ని అందించారు. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్, జవాన్లు రాజేశ్, హరీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న జవాన్లు

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ నిర్దేశించిన వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను ఏ ప్రభుత్వం కూడా నిలబెట్టుకోవటం లేదన్నారు. ఉత్పత్తిలో రెగ్యులర్ కార్మికులకు దీటుగా పనిచేస్తూ సంస్థ లాభాల్లో పాలుపంచుకుంటున్న వారికి అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు బ్రహ్మానందం, బందు అశోక్, గజ్జి మల్లేశ్, వెంకటేశ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జిలకర శంకర్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు తీర్పు వచ్చాక కొందరు వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. వర్గీకరణ సాధించేవరకు మాదిగలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఎమ్మార్పీఎస్ మండల కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు రామగిరి మహేశ్‌కుమార్, కాంపల్లి సతీశ్, మచ్చ రాజేశ్, కేశవ్, వంశీకృష్ణ, కార్తీక్, వెంకన్న, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం

బెల్లంపల్లి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ అన్నారు. పట్టణంలోని ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. మందమర్రి వారియర్స్, బెల్లంపల్లి వన్‌టౌన్ హంటర్స్, తాండూర్ పాంథర్స్, బెల్లంపల్లి రూరల్ లెజెండ్స్ జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో తాండూర్ పాంథర్స్, బెల్లంపల్లి రూరల్ లెజెండ్స్ జట్లు ఫైనల్‌కు చేరుకోగా తాండూర్ జట్టు విజేతగా నిలిచింది. బెల్లంపల్లి రూరల్‌జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. విజేతలకు ఏసీపీ రవి కుమార్ బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ ప్రతిరోజు పోలీసులు ఎంతో శ్రమకోర్చి విధి నిర్వహిస్తుంటారని తెలిపారు. వారికి క్రీడాపోటీలు నిర్వహించడం వల్ల మానసికంగా, శారీరకంగా ప్రశాంతత కలుగుతుందన్నారు. సీఐలు అఫ్జలుద్దీన్, కుమారస్వామి, శశిధర్‌రెడ్డి, దేవయ్య, సబ్ డివిజన్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


విజేతలకు బహుమతి అందిస్తున్న ఏసీపీ

పోచమ్మకు మొక్కు

భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్ పంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నైవేద్యం వండి సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి ఇంటిల్లిపాదిని చల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం చెట్ల కింద వంటావార్పు చేసుకొని భోజనం చేశారు.


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ప్రమాదకరంగా చెట్టు

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సమీపంలో తుమ్మచెట్టు వంగి రోడ్డుపైకి వచ్చింది. దీంతో లోడు వాహనాలకు తాకేలా ఉంది. ఈ చెట్టుతో ప్రమాదం పొంచి ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.



కాకా చిరస్మరణీయుడు

- జీఎం ఎల్వీ సూర్యనారాయణ
- ఘనంగా వెంకటస్వామి వర్ధంతి

శ్రీరాంపూర్: మాజీ కేంద్రమంత్రి, కాకా వెంకటస్వామి చిరస్మారణీయుడని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ఆయన వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కాకా వెంకటస్వామి ట్రేడ్ యూనియన్ నాయకుడిగా జీవితం మొదలుపెట్టి అంచలంచెలుగా ఎదిగి పలుమార్లు కేంద్రమంత్రిగా పని చేశారని తెలిపారు. ఏడుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. కార్మిక వర్గానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, డీజీఎం(పర్సనల్) ఆనంద్ కుమార్, ఫారెస్ట్ అధికారి చంద్రమణి, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని ఏఎంసీ చౌరస్తాలో వెంకటస్వామి విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వెంకటస్వామి ఆశయ సాధన కోసం పాటు పడతామన్నారు.ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద అన్నదానం చేశారు. నాయకులు మునిమంద రమేశ్, కొండగొర్ల అన్నమయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు కొండగొర్ల వేద ప్రకాశ్, ఆరిజిన్ డెయిరీ సీఈవో ఆదినారాయణ, గాలి శ్రీనివాస్, రంజిత్‌కుమార్, లక్ష్మణ్, ఎజాజ్, కుమార్, అంజద్ పాషా, శ్రీనివాస్, రహెమత్, శ్రేణులు పాల్గొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాకా చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో అన్నదానం, దుప్పట్లు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, చల్లా రాంరెడ్డి, అయిత హిమవంతరెడ్డి, నాయకులు బషీరొద్దీన్, బాపగౌడ్, రాజమల్లగౌడ్, మహేశ్‌ప్రసాద్ తివారి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాకా చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం కాకా చేసిన సేవలను కొనియాడారు. నాయకులు మహంకాళి శ్రీనివాస్, అబ్దుల్‌అజీజ్, గోపురాజం, పార్వతి విజయ, పలిగిరి కనకరాజు, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: టేకుమట్లలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ వైస్ ఎంపీపీ శీలం తలవెంకటేశ్, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు అంబల్ల రవి, తదితరులు గోదావరిఖనిలో కాకా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బల్ల వెంకటేశ్, మార్తమారుతి, మల్లయ్య, నారాయణ పాల్గొన్నారు.


శ్రీరాంపూర్: వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జీఎం సూర్యనారాయణ


బెల్లంపల్లి: వెంకటస్వామి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు


చెన్నూర్ క్యాంప్ కార్యాలయంలో..


జైపూర్ మండలం టేకుమట్లలో..

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: సంగారెడ్డిలో జనవరి 25 నుంచి 28 తేదీ వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి సంకె రవి కోరారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో ఆదివారం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభకు అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోమాస ప్రకాశ్, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్‌కుమార్, ప్రేమ్‌కుమార్, నాయకులు మోహన్, మహేశ్, రాములు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సీఎంకప్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ

చెన్నూర్: సీఎంకప్ జిల్లా స్థాయి వాలీబాల్, హ్యాండ్ బాల్ పోటీల్లో చెన్నూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కళాశాల పీఈటీ షాహీనా సుల్తానా తెలిపారు. గెలుపొందిన విజేతలకు కలెక్టర్ కుమార్ దీపక్ బహుమతులను అందజేసినట్లు పేర్కొన్నారు. వీరితోపాటు పీఈటీలను కళాశాల ప్రిన్సిపాల్ స్రవంతి, వైస్ ప్రిన్స్‌పాల్ సరిత అభినందించారు.

ఆగని మొరం దందా!

దండేపల్లి: మండలంలోని గూడెం గుట్టల్లో అక్రమ మొరం దందా ఆగడం లేదు. రాత్రివేళ జేసీబీలతో తవ్వకాలు జరిపి టిప్పర్ల ద్వారా తరలించాల్సిన చోటికి తరలిస్తున్నారు. అక్రమ మొరం తవ్వకాలకు అధికారులు అడ్డుకట్ట వేయకుండా మామూళ్లుగా వ్యవహరించడంతో అక్రమ మొరం దందాకు అడ్డు అదుపు లేకుండా యథేచ్ఛగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

